16-11-2021 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - జ్ఞానవంతులుగా అయినట్లయితే ధనవంతులుగా అవుతారు, జ్ఞాన-జ్ఞానేశ్వరి అయిన జగదంబయే రాజ-రాజేశ్వరిగా అవుతారు"

ప్రశ్న:- తండ్రికి తమ పిల్లల పట్ల దయ కలుగుతుంది, అందుకే శ్రేష్ఠ భాగ్యాన్ని తయారుచేసుకునేందుకు ఏ శ్రీమతాన్ని ఇస్తారు?

జవాబు:- మధురమైన పిల్లలూ - తలపై పాపాల భారం ఏదైతే ఉందో, దానిని మృత్యువు కన్నా ముందే స్మృతి యాత్రలో ఉంటూ తొలగించుకోండి. ఏ వికర్మ చేయకండి. తండ్రి మిమ్మల్ని యమదూతల ఉరికంబం నుండి విడిపించేందుకు వచ్చారు కనుక ఇప్పుడు అటువంటి కర్మలేవీ చేయకండి.

గీతము:- రాత్రి ప్రయాణీకుడా అలసిపోకు..... (రాత్ కే రాహీ థక్ మత్ జానా.....)

ఓంశాంతి. మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలు ఈ పాట అర్థాన్ని తెలుసుకున్నారు. తండ్రి భక్తి రూపీ రాత్రిని వినాశనం చేసి పగలును స్థాపన చేయడానికి వచ్చారు ఎందుకంటే ఓ పతితపావనా రండి, అని తండ్రినే పిలుస్తారు. ఒకానొక సమయంలో మేము పావనంగా ఉండేవారము, ఇప్పుడు పతితంగా ఉన్నామని అర్థం చేసుకుంటారు. ఏ వస్తువైతే ఒకప్పుడు ఉండేదో, ఇప్పుడు లేదో, దానినే అడగడం జరుగుతుంది. పవిత్రమైన దేవీ-దేవతల రాజధాని ఉండేదని పిల్లలైన మీకు తెలుసు. జ్ఞాన-జ్ఞానేశ్వరియే తర్వాత రాజ-రాజేశ్వరిగా అవుతారు. జగదంబ మరియు లక్ష్మి వేర్వేరు. లక్ష్మిని ఎప్పుడూ జగదంబ అని అనరు. లక్ష్మిని వారి ఇద్దరు పిల్లలు మాత్రమే మాతేశ్వరి అని పిలుస్తారు. ఇక్కడ జగదంబను ధార్మిక మనస్తత్వం కల భారతవాసులందరూ తల్లి అని అంటారు. దేవీ-దేవతల మందిరాలకు వెళ్ళి వారికి భక్తి చేస్తారు. మనం చాలా భక్తి చేసామని ఇప్పుడు మీకు తెలిసింది. దాన-పుణ్యాలు మొదలైనవి మీరు ఎంతగా చేసారో, అంతగా వేరెవ్వరూ చేసి ఉండరు. మీరు అందరికంటే ఎక్కువ భక్తి చేసారు. ఇప్పుడు మీరు మీ స్మృతిచిహ్నాన్ని జీవిస్తూనే చూసారు. ఆదిదేవ్ మరియు ఆదిదేవి ఉన్నారు, వారిని జగదంబ అని అంటారు. జగదంబ ధనవంతురాలుగా అవుతారని ఇప్పుడు మీకు తెలుసు. మీరు వారి పిల్లలు కదా. ఇప్పుడు మీరు చదువుకుంటున్నారు. వారు జ్ఞాన దేవి. ఆ చదువుతో ఎప్పుడూ రాజా-రాణులుగా అవ్వరు. ఆత్మలమైన మనం శివబాబా పిల్లలమని మరియు వీరు ప్రజాపిత బ్రహ్మా అని మీకు తెలుసు. శివబాబా వీరి ద్వారా కొత్త ప్రపంచాన్ని స్థాపన చేస్తున్నారు. బ్రహ్మా ద్వారా స్థాపన అని అంటూ ఉంటారు కూడా. ఈ విషయాలను మంచి రీతిగా అర్థం చేసుకొని ధారణ చేయాలి. పులి పాల కోసం బంగారు పాత్ర కావాలని అంటారు కదా. ఈ జ్ఞానం కూడా సర్వశక్తివంతుడైన పరమపిత పరమాత్మది. దీని కోసం కూడా బుద్ధి రూపీ పాత్ర స్వర్ణిమముగా ఉండాలి. కొత్త ప్రపంచంలో ఆత్మ మరియు శరీరం, రెండు స్వర్ణిమంగా అవుతాయి. ఇప్పుడు మీ ఆత్మ రాతి పాత్ర వలె ఉంది. కనుక శరీరం కూడా అలాగే ఉంది. భారత్ లోనే శ్యామము మరియు సుందరము, పతితము మరియు పావనము అని అంటారు. మీరు వచ్చి పతితులైన మమ్మల్ని పావనంగా తయారుచేయండి అని ఇంకే ఇతర ఖండాలలోను అనరు. దుఃఖం నుండి విడిపించి శాంతిలోకి తీసుకువెళ్ళండి అని అంటారు. భారతవాసులైన మనం పావనంగా ఉండేవారమని, ఈ లక్ష్మీ-నారాయణుల రాజ్యముండేదని వివేకం కూడా చెప్తుంది. ఎంత పెద్ద వ్యక్తులైనా సరే, వారు కూడా గురువు పాదాలపై పడతారు ఎందుకంటే గురువు సన్యాసాన్ని ధారణ చేసి ఉన్నారు, 5 వికారాలను వదిలారు. కనుక వికారులు నిర్వికారులకు గౌరవమిస్తారు. పవిత్రతకే గౌరవముంది. ద్వాపరం నుండి రాజా-రాణి మరియు మంత్రి ఉంటారు. సత్యయుగంలో రాజా-రాణులకు మంత్రులు ఉండరు. ఎప్పుడైతే పతిత రాజా-రాణులుంటారో, అప్పుడు ఒక మంత్రిని పెట్టుకుంటారు. ఇప్పుడు చాలా పతితంగా అయిపోయారు కావున వందలాది మంది మంత్రులను పెట్టుకుంటారు. ఇది కూడా డ్రామా రాత. బాబా అంటారు - డ్రామా రాత ఎలా రచించబడి ఉందో చూడండి. ముందు తప్పకుండా భారత్ మాత్రమే ఉండేది, తర్వాత ఇతర ధర్మాల వారు వచ్చారు. తండ్రి అర్థం చేయిస్తారు - ఈ సమయంలో మీరు జ్ఞాన-జ్ఞానేశ్వరీలు. జగదంబ బ్రహ్మా పుత్రిక, జ్ఞాన దేవి. జగదంబ జ్ఞానవంతురాలు. వారు మరుసటి జన్మలో ధనలక్ష్మిగా అవుతారు. ఇప్పుడు తండ్రి మీకు జ్ఞానాన్ని నేర్పిస్తున్నారు. మనం అక్కడ ధనవంతులుగా అవుతామని మీకు తెలుసు. ఈ లక్ష్మీనారాయణులు ధనవంతులుగా ఎలా అయ్యారు అనేది ప్రపంచంలో ఎవ్వరికీ తెలియదు. ఆ బ్రహ్మా-సరస్వతులే లక్ష్మీ-నారాయణులు. బ్రహ్మా జగత్పిత కనుక తప్పకుండా బ్రాహ్మణ-బ్రాహ్మణీలు చాలా మంది ఉంటారు. మీరు ఎంతమంది బ్రాహ్మణ-బ్రాహ్మణీలున్నారు! మనం ఈ జ్ఞానంతో భవిష్యత్తులో ఇలాంటి ధనవంతులుగా అవుతామని మీకు తెలుసు. పూర్తిగా ధన దేవీలుగా అవుతాము, వారి వద్ద

ఉన్నదాని కన్నా ఎక్కువ ధనం ఎవరి వద్దా ఉండదు, అందుకే జ్ఞానం సంపాదనకు ఆధారమని అంటూ ఉంటారు. జడ్జి, బ్యారిస్టరు మొదలైనవారిగా జ్ఞానంతోనే అవుతారు కదా. కనుక ఇది సంపాదన కదా. కొంతమంది డాక్టర్లకు ఒక్కొక్క కేసుకు లక్షల రూపాయలు లభిస్తాయి. ఎవరైనా రాజా-రాణి లేక రాకుమారుడు అనారోగ్యం పాలైనప్పుడు, డాక్టర్ అనారోగ్యం నుండి విడిపిస్తే వారు సంతోషించి పెద్ద-పెద్ద భవనాలను నిర్మించుకునేందుకు ధనాన్ని ఇస్తారు. ఎంత సంపాదన జరుగుతుంది! కనుక చదువుతోనే పదవిని పొందుతారు. ఇది మీ చదువు కూడా, వ్యాపారం కూడా.

మధురమైన పిల్లలైన మీరు ఇప్పుడు వ్యాపారం చేయడానికి వచ్చారు. పనికిరానివి ఇచ్చి లక్షలు సంపాదిస్తారు. తండ్రి అవినాశీ సర్జన్ కూడా, సదా ఆరోగ్యవంతులుగా తయారయ్యేందుకు బాబా యోగాన్ని నేర్పిస్తున్నారు. బాబా అంటారు - మీరు 21 జన్మలకు సదా ఆరోగ్యవంతులుగా అవుతారని నేను గ్యారంటీ ఇస్తాను. మరి అటువంటి సర్జన్ ఇచ్చే మందును ఎందుకు తీసుకోకూడదు అనగా శ్రీమతాన్ని ఎందుకు అనుసరించకూడదు. తండ్రి మతాన్ని స్వీకరించండి. నన్ను స్మృతి చేయండి. స్మరణ చేస్తూ-చేస్తూ సుఖాన్ని పొందండి, శరీరం యొక్క కలహ క్లేశాలన్నీ సమాప్తమవుతాయని అంటారు కదా. భక్తి మార్గంలో కలహ క్లేశాలేవీ సమాప్తమవ్వవు. చాలా మంది సన్యాసులు కూడా అనారోగ్యంతో, పక్షవాతంతో పడి ఉంటారు, పిచ్చివారిలా అయిపోతారు. మనం తండ్రి శ్రీమతాన్ని అనుసరిస్తే సదా ఆరోగ్యవంతులుగా అవుతామని పిల్లలైన మీకు తెలుసు. అక్కడ ఆయుష్షు సుమారుగా 125-150 సంవత్సరాలు ఉంటుంది. అలాగని ద్వాపరంలో ఒక్కసారిగా 35 సంవత్సరాలైపోతుందని కాదు. అలా అవ్వదు. ముందు 100-125 అవుతుంది, తర్వాత 70-80 అవుతుంది, ఇప్పుడైతే 35-40 సంవత్సరాల వరకు వచ్చి చేరుకుంది. చిన్నతనంలోనే మరణిస్తారు ఎందుకంటే భోగీలుగా ఉన్నారు. ఇప్పుడు భోగీల నుండి యోగీలుగా అవుతున్నారని మీకు తెలుసు. అక్కడ ఆయుష్షు ఎంత ఎక్కువగా ఉంటుందంటే, అకాల మృత్యువు ఎప్పుడూ సంభవించదు. మీకు ఎంతటి రాజ్య భాగ్యముండేది అని తండ్రి స్మృతినిప్పిస్తారు. ఇప్పుడు రావణుడు దోచుకున్నాడు. అక్కడ ఈ మందిరాలు మొదలైనవి ఉండవు. మీ స్లోగన్ కూడా ఏమిటంటే - భారత్ యొక్క ఆది సనాతన దేవీ-దేవతా ధర్మం జిందాబాద్, మిగిలినవన్నీ ముర్దాబాద్ అనగా అనేక ధర్మాల వినాశనం జరగాలి. అక్కడ కేవలం ఒక్క భారత ఖండం మాత్రమే ఉండేది. ఒక్క ఖండంలో మనుష్యులు కూడా తప్పకుండా కొద్దిమందే ఉంటారు. కొద్ది సమయంలో భారత్ జనాభా 9 లక్షలవుతుందని, మిగిలిన వారంతా సమాప్తమవుతారని మీరు రాయవచ్చు. ఏక ధర్మ స్థాపన ఇప్పుడు జరుగుతుంది. కొత్త దైవీ రాజ్యంలో ఒకే భాష ఉంటుంది, ఒకే ఆచార-వ్యవహారము ఉంటుంది. ఇక్కడ ప్రతి ఒక్కరి ఆచారం ఎవరిది వారిది. అక్కడ ఒకే రాజ్యము, ఒకే కమ్యూనిటీ ఉండేది. మీరు ఇలాంటి స్లోగన్లను వార్తా-పత్రికలలో కూడా వేయవచ్చు. బాబాను సలహా అడుగుతారు - ధనం ఖర్చు చేసి వార్తా-పత్రికలలో వేయించమంటారా? బాబా అంటారు - వేయించండి, ఏం జరుగుతుందో మనుష్యులకు తెలుస్తుంది. క్రీస్తుకు 3 వేల సంవత్సరాల క్రితం స్వర్గముండేదని అంటారు కూడా. సూర్యవంశీ దేవీ-దేవతల ఒకే ధర్మం, ఒకే కమ్యూనిటీ ఉండేది. ఈ మహాభారత యుద్ధం తర్వాత స్వర్గ ద్వారాలు తెరుచుకున్నాయి. వార్తా-పత్రికలలో వేయండి, పేరు బి.కె.లది ఉండాలి. కానీ ఎప్పుడైతే పవిత్రంగా ఉంటారో, అప్పుడే బి.కె.లుగా పిలువబడతారు. తండ్రిని పిలిచారు. ఇప్పుడు తండ్రి వచ్చారు కనుక ఇప్పుడు తండ్రితో ప్రతిజ్ఞ చేయండి. భక్తి మార్గంలో ఎన్ని ఎదురుదెబ్బలు తిన్నారు, యజ్ఞ-తపాదులు, దానాలు మొదలైనవి చేసారు. ముందు ఒక్క శివుని భక్తి చేసేవారు, తర్వాత దేవతలది. ఇప్పుడైతే వ్యభిచారులుగా అయ్యారు. ఇప్పుడు తండ్రి మిమ్మల్ని అన్ని దుఃఖాల నుండి విడిపిస్తారు. ఇప్పుడు తండ్రి పిల్లలైన మీకు జ్ఞానాన్ని ఇచ్చి ఎంత ఉన్నతంగా, మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేస్తారు. సత్యయుగంలో మీ వద్ద అన్నీ బంగారంవే ఉంటాయి. తండ్రి మీకు శ్రీమతాన్ని ఇచ్చి స్వర్గానికి యజమానులుగా తయారుచేస్తారు. మరి మీరు శ్రీమతాన్ని ఎందుకు అనుసరించడం లేదు. తండ్రి యమదూతల ఉరికంబం నుండి విడిపిస్తారు, గర్భజైలు శిక్షల నుండి విడిపిస్తారు. మీరు స్వర్గంలో గర్భ మహల్లో ఉంటారు. ఇక్కడ జైలు ఉంది ఎందుకంటే మనుష్యులు పాప కర్మలు చేస్తారు. అక్కడ 5 వికారాలే ఉండవు, అయినా రాజా-రాణి, ప్రజ పదవులలో తేడా అయితే ఉంటుంది కదా. మనుష్యులు ధనం సంపాదించేందుకు శ్రమ అయితే చేస్తారు కదా. అక్కడ మంత్రులుండరు ఎందుకంటే మీరు ఇక్కడి ప్రారబ్ధాన్ని పొందుతారు. ఇప్పుడు తండ్రి అంటారు - పిల్లలూ, మీరు శ్రీమతాన్ని అనుసరించండి. నేను దూరదేశం నుండి పతిత శరీరంలోకి, పతిత రాజ్యంలోకి వచ్చాను. ఇది రావణుడి దేశము. నేను వచ్చి పిల్లలైన మీకు వారసత్వాన్ని ఇస్తాను. ఇటువంటి తండ్రి ఆజ్ఞను పాటించకపోవడం అంటే వారు కుపుత్రులుగా అయినట్లు. వికారాల వెనుక ఇంతగా హైరానా పడకూడదు. బాబా అంటారు - ఈ వికారాలు దుఃఖాన్నిచ్చేవి, పతితులను పావనులుగా తయారుచేయడం - ఇది నా పని. ఎంత ప్రేమగా అర్థం చేయిస్తారు - తినండి, తాగండి, సుఖమయంగా ఉండండి. మేము శివబాబా వద్దకు వచ్చామని, వారి ద్వారా మా పాలన జరుగుతుందని గుర్తుంచుకోండి. ఒకవేళ మిత్ర-సంబంధీకులు మొదలైనవారి వస్తువులను ధరిస్తే, వారు గుర్తుకొస్తారు, పదవి

భ్రష్టమవుతుంది. ఇక్కడ శివబాబా భండారీ నుండి, పతితపావనుడైన తండ్రి యజ్ఞం నుండి పాలన జరగాలి, అంతేకానీ పతిత ఇంటి నుండి కాదు. ఎవరైనా ఇచ్చిన వస్తువులుంటే, వారు గుర్తుకొస్తారు. దీని గురించే అంటూ ఉంటారు - అంతిమ సమయంలో ఎవరైతే స్త్రీని స్మరిస్తారో..... అని. ఎంత మంచి అవస్థ ఉండాలి. గృహస్థ వ్యవహారంలో ఉంటూ, ఇదంతా సమాప్తమయ్యే ఉందని బుద్ధి ద్వారా అర్థం చేసుకోవాలి. నా వారైతే ఒక్క బాబాయే. ఇప్పుడు తండ్రి మాలను ఎప్పుడైనా స్మరించడం జరుగుతుందా? నేను పిల్లలైన మీకు స్మృతినిప్పిస్తున్నాను - నన్ను స్మృతి చేయండి, మీకు చాలా బలం లభిస్తుంది, వికర్మలు వినాశనమవుతాయి, బలశాలిగా అవుతారు. ఈ లక్ష్మీనారాయణులు బలశాలులు కదా. ఎవరైతే బలశాలిగా ఉంటారో, వారు రాజ్యాన్ని పొందుతారు. బాబా తన ఉదాహరణను చెప్తారు - నేను 12 మంది గురువులను ఆశ్రయించాను, ఉదయాన్నే లేచి 1000 సార్లు మాల జపించమని గురువు చెప్పారు. దానికి నేను చెప్పేవాడిని - వేరే సమయమేదైనా చెప్పండి, రోజంతా వ్యాపార వ్యవహారాలతో అలసిపోతాను అని. మీరు కూడా ఇలాగే చెప్తారు కదా - బాబా, ఉదయాన్నే లేవలేకపోతున్నాము అని. తండ్రి అంటారు - మేము పవిత్రంగా ఉండలేము, స్మృతిలో ఉండలేము అని చెప్పకండి. స్మృతి చేయకపోతే వికర్మలు ఎలా వినాశనమవుతాయి. మీరు తమోప్రధానం నుండి సతోప్రధానంగా తప్పకుండా అవ్వాలి. ఇది అంతిమ జన్మ, తప్పకుండా పవిత్రంగా అవ్వండి. తండ్రి శ్రీమతాన్ని అనుసరించకపోతే ఏ పదవిని పొందుతారు? అర్ధకల్పం నుండి నన్ను పిలిచారు. ఇప్పుడు నేను చెప్తున్నాను - పావనంగా అయి నన్ను స్మృతి చేయండి, ఇతరులకు కూడా మార్గాన్ని తెలియజేస్తూ ఉండండి, సందేశం ఇస్తూ ఉండండి. తండ్రి అంటారు - మన్మనాభవ. మృత్యువు ఎదురుగా నిలబడి ఉంది. మిమ్మల్నే మెసెంజర్ లేక పైగంబర్ (సందేశకులు) అని అంటారు. బ్రాహ్మణులైన మీరు తప్ప వేరెవ్వరూ మెసెంజర్ గా కాలేరు. పతితపావనుడైన శివబాబా వస్తారు, వారు ఎవరిలో ప్రవేశిస్తారు అనేది కూడా రాయబడి ఉంది. బ్రహ్మ ద్వారా స్థాపన, ఇది అర్థం చేసుకోరు. సూక్ష్మవతనంలో ప్రజాపిత బ్రహ్మ ఉంటారా? ఇక్కడే పతితుల నుండి పావనులుగా అవుతారు. సైలెన్స్ బలంతో స్థాపన జరుగుతుంది, సైన్స్ బలంతో వినాశనం జరుగుతుంది. శాంతి ఎలా లభిస్తుంది అని అందరూ అంటారు. ఇప్పుడు ఆత్మ ఉన్నదే శాంతి స్వరూపము. ఇక్కడకు పాత్రను అభినయించేందుకు వచ్చింది. ఇక్కడ శాంతిగా ఎలా ఉంటారు? ఆ శాంతి శాంతిధామంలో లభిస్తుంది. ఇక్కడైతే దుఃఖం లభిస్తుంది. సత్యయుగంలో సుఖం-శాంతి, రెండూ ఉంటాయి.

ఇప్పుడు పిల్లలైన మీరు ఇక్కడ సమ్ముఖంలో వింటారు. తండ్రి అంటారు - పతితులు నన్ను ఎప్పుడూ కలవకూడదు, లేదంటే వారిని తీసుకొచ్చే బ్రాహ్మణికి పాపం అంటుకుంటుంది (ఇంద్రసభలోని దేవకన్య వలె). వాస్తవానికి ఇంద్రసభ అంటే ఇది. వీరు జ్ఞాన సబ్జ పరీలు, పుఖరాజ్ పరీలు. కనుక ఇంకా శిక్ష పడుతుంది. బాబా ఖచ్చితంగా నిరాకరిస్తారు. పతితులెవ్వరినీ తీసుకురాకూడదు. ఇంతకుముందు బాబా ఎప్పుడూ, ప్రతిజ్ఞ చేసారా అని అడిగేవారు. పురుషార్థం చేస్తున్నామని చెప్పేవారు. ఎప్పుడైతే పక్కా నిశ్చయం ఏర్పడుతుందో, అప్పుడే కలవాలి. ఒకవేళ తండ్రిని కలిసి మళ్ళీ వికారాలలోకి వెళ్తే 100 రెట్ల శిక్ష పడుతుంది. అప్పుడు తండ్రి, బహుశా వీరి భాగ్యంలో లేదని భావిస్తారు. తండ్రి అయితే, భాగ్యాన్ని తయారుచేసుకునేందుకు పురుషార్థం తెలియజేస్తారు. మరి అటువంటి తండ్రి చెప్పినది వినకపోతే వారి గతి ఏమవుతుంది! తండ్రికి దయ కలుగుతుంది. తండ్రి అంటారు - మిమ్మల్ని మీరు సరి చేసుకుంటూ వెళ్ళండి. అంతేకానీ, నడుస్తూ-నడుస్తూ మరణించడం కాదు. మేము తండ్రిని స్మృతి చేసి పాపాల భారాన్ని తొలగించుకోవాలి అనే భయముండాలి. అచ్ఛా!

అందరికీ సద్గతినిచ్చేవారు ఒక్క శివబాబా మాత్రమే, వారి ఫోటో తీయలేము. వారిని దివ్య దృష్టితో మాత్రమే చూడగలరు. ఇకపోతే, వారిని తెలుసుకోగలరు. అచ్ఛా.

మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఎటువంటి అవస్థను తయారుచేసుకోవాలంటే, అంతిమ సమయంలో ఒక్క తండ్రి స్మృతి మాత్రమే రావాలి. ఇతురులెవ్వరూ స్మృతి రాకూడదు. ఇదంతా వినాశనం అవ్వనున్నదని బుద్ధిలో ఉండాలి.

2. మిమ్మల్ని మీరు సరి చేసుకోవాలి. ఈ అంతిమ జన్మలో తప్పకుండా పవిత్రంగా అవ్వాలి. మా ద్వారా ఏ పాప కర్మ జరగకూడదు అని భయముంచుకోవాలి.

వరదానము:- నంబరువన్ బిజినెస్ మేన్ గా అయి ఒక్కొక్క సెకండు మరియు సంకల్పంలో సంపాదనను జమ చేసుకునే పదమపతి భవ

ఎవరికైతే స్వయాన్ని బిజీ పెట్టుకునే విధానం తెలుసో, వారే నంబరువన్ బిజినెస్ మేన్. బిజినెస్ మేన్ అనగా వారి ఒక్క సంకల్పం కూడా వ్యర్థంగా పోకూడదు, ప్రతి సంకల్పంలో సంపాదన ఉండాలి. ఎలాగైతే ఆ వ్యాపారస్థులు ఒకొక్క పైసాను కార్యంలో ఉపగించి పదమాల రెట్లుగా చేస్తారో, అదే విధంగా మీరు కూడా ఒక్కొక్క సెకండు మరియు సంకల్పంలో సంపాదించి చూపించండి, అప్పుడు పదమపతులుగా అవుతారు. దీనితో బుద్ధి భ్రమించడం ఆగిపోతుంది మరియు వ్యర్థ సంకల్పాల ఫిర్యాదు కూడా సమాప్తమైపోతుంది.

స్లోగన్:- ఎవరైతే యాచిస్తారో, వారు సంతోషమనే ఖజానాతో సంపన్నం కాలేరు.